EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
28-12-2024
పేజీలు: 02

పుష్ప స్టైల్‌లో నితీశ్ రెడ్డి హాఫ్ సెంచరీ

బాక్సింగ్ డే టెస్టులో భారత్ మళ్లీ గాడిలో పడింది. ఫాలో ఆన్ గండం నుంచి బయటపడిన టీమ్‌ఇండియా.. తొలిఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన స్కోర్ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా నయా స్టార్ నితీశ్ రెడ్డి ఆసీస్‌పై తొలి అర్ధ శతకం నమోదుచేశాడు. దీంతో పుష్ప స్టైల్‌లో 'తగ్గేదేలే' అంటూ మేనరిజంతో సంబురాలు చేసుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది.మూడో ఆటను ప్రారంభించిన కొద్ది సేపటికే పంత్, జడేజాను ఆసీస్ బౌలర్లు పెవీలియన్‌కు పంపారు. దీంతో భారత్ ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడం కష్టమనే అనిపించింది. అయితే నవీన్ రెడ్డి ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తనదైన షాట్స్‌తో స్కోర్ బోర్డును పరుగులు పెట్టిస్తున్నాడు. మరో ఎండ్‌లో అతనికి వాషింగ్టన్ సుందర్ చక్కని సహకారం అందిస్తున్నాడు.



స్టాండ్స్‌లో తండ్రి ఆనందం

బోర్డర్-గావస్కర్ టోర్నమెంట్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ అదరగోడుతున్న విషయం తెలిసిందే. పేస్ ఆల్‌రౌండర్‌గా టీంలోకి వచ్చిన అతడు నాలుగో టెస్ట్‌లో టీమిండియాను ఫాల్ ఆన్ గండం నుంచి బయటపడేశాడు. ఈ క్రమంలోనే టెస్ట్ కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. 171 బంతుల్లో ఈ రికార్డును అందుకున్న నితిష్.. ఎనిమిదో స్థానంలో వచ్చి ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక పరుగులు సాధించిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు దిగ్గజ క్రికెటర్ కుంబ్లే (87) పేరిటా ఉంది. ఇదిలావుంటే నితిష్ కుమార్ రెడ్డి సెంచరీ సాధించడంతో స్టాండ్స్‌లో ఉన్న అతని తండ్రి ముత్యాలరెడ్డి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు! లేచి నిలబడి చప్పట్లు కొట్టి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆసిస్ గడ్డపై నితీశ్ కుమార్ రెడ్డి సూపర్ సెంచరీ

బోర్డర్ గావస్కర్ టెస్టు సిరీస్ లో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి అదరగొడుతున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి ప్లేయర్లు విఫలం అవుతున్న సిరీస్ లో డెబ్యూ సిరీస్ లోనే నితీశ్ కుమార్ రెడ్డి ఆకాశమే హద్దుగా ఆడుతున్నాడు. తొలి నాలుగు ఇన్నింగ్స్ ల్లో ఏకంగా మూడు సార్లు టాప్ స్కోరర్ గా నిలిచిన నితీశ్ రెడ్డి.. ప్రస్తుతం జరుగుతున్న నాలుగో టెస్టులో రెచ్చిపోయాడు. ఏకంగా సెంచరీతో కదం తొక్కాడు. మూడో రోజు బ్యాటింగ్ కు వచ్చిన నితీశ్ రెడ్డి 170 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయ కెరీర్ లో నితీశ్ కుమార్ రెడ్డికి ఇదే తొలి సెంచరీ కావడం విశేషం. 21 ఏళ్ల వయసులో తొలి అంతర్జాతీయ టెస్టు సెంచరీని అందుకుని వారెవ్వా అనిపించాడు. నితీశ్ రెడ్డి పోరాటానికి వాషింగ్టన్ సుందర్ (50) కూడా తోడవడ్వడంతో ఆస్ట్రేలియాతో జరగతున్న నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరుకు టీమిండియా ధీటుగా బదులిచ్చింది. వికెట్లు టపటపా పడుతున్నాయి... ఇదే కొనసాగితే టీమిండియా ఫాలో ఆన్ ఆడాల్సి వుంటుంది. పరిస్థితి ఏమంత బాగాలేదు. అప్పటికే ప్రధాన బ్యాట్స్ మెన్స్ పెవిలియన్ కు చేరారు. ఇలా టీమిండియా కష్టకాలంలో వుండగా నితీష్ ఆశాకిరణంలా మెరిసాడు. మొదట మెల్లిగా ఆడుతూ వికెట్ పడకుండా చూసుకున్నాడు... పిచ్ ఎలా వుందో అర్థం చేసుకున్నాడు... ఆ తర్వాత బ్యాట్ ను ఝుళిపించడం షురూ చేసాడు.

ప్రత్యర్థి బౌర్లను టీటుగా ఎదుర్కొంటూ ఒక్కో పరుగును జోడించాడు...వీలు చిక్కినప్పుడు చక్కటి బౌండరీలు బాదాడు. తనదైన బ్యాటింగ్ తో రెచ్చిపోయిన నితీష్ టెస్ట్ కెరీర్ లో మొదటి సెంచరీ సాధించాడు. ఇలా వ్యక్తిగత రికార్డును సాధించడమే కాదు టీమిండియాను ఫాలో ఆన్ గండం నుండి బైటపడేసాడు. నితీష్ బ్యాటింగ్ ను చూసి అభిమానులే కాదు టీమిండియా క్రికెటర్లు సైతం ఆశ్చర్యపోయాడు. ఇంత పరిణతితో అతడు ఆడిన తీరు చూసి గవాస్కర్ లాంటివారు ఫిదా అయిపోయారు. నితీష్ కుమార్ రెడ్డికి వాషింగ్టన్ సుందర్ నుండి మంచి సహకారం లభించింది. అతడు కూడా హాఫ్ సెంచరీతో మెరిసాడు. వీళ్లద్దరు కలిసి సెంచరీకి పైగా భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో టీమిండియా మంచి స్కోరు సాధించి ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే స్థాయిలో నిలిచింది.

ఎవరీ నితీష్ కుమార్ రెడ్డి?

నితీష్ కుమార్ రెడ్డి గత ఇండియన్ ప్రీమియర్ లీగ్ ద్వారా వెలుగులోకి వచ్చాడు. సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఈ తెలుగు కుర్రాడు ఒకే ఒక్క సుడిగాలి ఇన్నింగ్స్ తో తన జాతకాన్నే మార్చుకున్నాడు. ఇలా ఐపిఎల్ లో అదరగొట్టిన నితీష్ తన కలను నిజం చేసుకున్నాడు... టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఇప్పుడు ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడే అవకాశం రావడంతో దాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. అయితే గత మూడు మ్యాచుల్లో అద్భుతంగా ఆడినా ప్రతిసారీ హాఫ్ సెంచరీకి చేరువలో ఔటయ్యాడు. కానీ ఈసారి అలా కాదు... అద్భుతంగా ఆడి సెంచరీ బాదాడు. ఇలా విదేశీ గడ్డపై సత్తాచాటి తన కెరీర్ లో తొలి సెంచరీ సాధించాడు నితీష్. దీంతో ఒక్కసారిగా తెలుగు ఆల్ రౌండర్ పేరు మారుమోగిపోతోంది. ఎవరీ నితీష్ కుమార్ రెడ్డి ? అని అభిమానులు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా గడ్డపై ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మన తెలుగు యువకెరటం నితీష్ వ్యక్తిగత వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. నితీష్ కుమార్ రెడ్డి స్వస్థలం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం. చిన్నప్పటి నుండే క్రికెట్ పై మక్కువ పెంచుకున్న అతడికి కుటుంబ ప్రోత్సాహం కూడా లభించింది. దీంతో విశాఖ గల్లీల్లో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న అతడు ఇప్పుడు విదేశీ గడ్డపై సెంచరీ మోత మోగించాడు. నితీష్ విశాఖలో నివసించే సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. అతడి తండ్రి ముత్యాల రెడ్డి విశాఖలోని హిందుస్థాన్ జింక్ లో చిన్న ఉద్యోగిగా పనిచేసేవారు. తల్లి గృహిణి. అయితే కొడుకు క్రికెట్ ను ఇష్టపడటంతో ఆ తల్లిదండ్రులు ఆ దిశగానే నితీష్ ను తీర్చిదిద్దారు. చదువు పాడయిపోతుందని, క్రికెట్ లో లైఫ్ లేదని అందరి తల్లిదండ్రులు నిరుత్సాహపర్చకుండా కొడుకు క్రికెట్ నే కెరీర్ గా ఎంచుకునేలా చూసారు. కొడుకు కెరీర్ కోసం ముత్యాలరెడ్డి తన ఉద్యోగాన్ని కూడా వదులుకున్నారు. ఇలా చాలా చిన్నప్పుడే బ్యాట్ చేతబట్టిన నితీష్ అంచెలంచెలుగా ఎదిగాడు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో రాటుదేలిన నితీష్ టీమిండియా మాజీ ప్లేయర్ ఎమ్మెస్కే ప్రసాద్ కంటపడ్డాడు. అతడి టాలెంట్ ను గుర్తించిన ఎమ్మెస్కే కడపలోని ఏసిఏ అకాడమీలో చేరేందుకు సహకరించాడు. అక్కడే నితీష్ పరిపూర్ణమైన క్రికెటర్ గా మారాడు.

ఉరి వేసుకున్న రైతు కుటుంబం

రైతన్న కంట కన్నీరు ఆగడం లేదు.. ఎక్కడో ఒకచోట ఏదో ఒక రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకుంటూనే ఉంటుంది. వేసిన పంటకు గిట్టుబాటు లేక, చేసిన కష్టం తీరక, అప్పుల బాధతో అనువులు బాస్తున్నారు. అలాంటి సంఘటన ఇప్పుడు కడప జిల్లాలో జరిగింది. ఓ రైతు కుటుంబం తాను సాగు చేస్తున్న పొలంలోనే ఉరి వేసుకుని ప్రాణాలను విడిచింది. ఈ హృదయ విధారకమైన సంఘటన ఆ గ్రామంలో విషాదఛాయలను నింపింది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలో అప్పుల బాధ తాళలేక రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకుంది.. మృతుడు నాగేంద్ర ఆయన భార్య వాణి, పిల్లలు గాయత్రి, భార్గవ్ నలుగురు పొలంలో ఉరి వేసుకుని ప్రాణాలు కోల్పోయారు. వారు సాగు చేస్తున్న పొలంలోనే ఉరి వేసుకొని చనిపోవడంతో ఆ గ్రామం అంతా వారి మృతితో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రస్తుతం రైతు నాగేంద్ర కొర్ర పంటను సాగు చేస్తున్నారు. అంతేకాక మరో ఒకటిన్నర ఎకరా భూమిలో చీని పంటను సాగు చేస్తున్నాడు. వాటితో పాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకుని 8 ఏళ్లుగా వివిధ రకాల పంటలను సాగు చేస్తూ, తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఎన్ని చేసినా దిగుబడి వస్తే రేటు లేకపోవడం రేటు ఉన్నప్పుడు దిగుబడి లేకపోవడంతో, ప్రతిసారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది ఆ రైతుకు. అంతే ఇన్నేళ్లు చేసిన

కష్టం ఫలితం ఇవ్వకపోవడంతో చేసేదేమీలేక ప్రాణాలు విడిచాడు. పంట కోసం చేసిన అప్పులు ఎక్కువ అవడంతో కుటుంబంతో సహా తన సాగు చేస్తున్న పొలంలోనే ఉరి వేసుకుని చనిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రూ.1.2 లక్షలు నష్టపోయిన బిట్‌కాయిన్

క్రిప్టో కరెన్సీ మార్కెట్లు గత 24 గంటల్లో కాస్త డీలా పడ్డాయి. మార్కెట్ విలువ 1.43% తగ్గి $3.29Tగా ఉంది. బిట్‌కాయిన్ $1492 (Rs1.2L) నష్టపోయింది. ప్రస్తుతం స్వల్పంగా పెరిగి $94,472 వద్ద ట్రేడవుతోంది. రెండో అతిపెద్ద కాయిన్ ఎథీరియమ్ 1.23% నష్టంతో $3335 వద్ద కొనసాగుతోంది. BTC, ETH డామినెన్స్ వరుసగా 56.8%, 12.2%గా ఉన్నాయి. BNB, TRX 2% పెరగ్గా XRP 1.35, SOL 2.31, DOGE 0.55, AVAX 2.78% మేర తగ్గాయి.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో 29 కంపార్టుమెంట్లు నిండిపోయాయి.తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో 29 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో స్వామివారి సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. 3నిన్న స్వామివారిని 66,715, మంది భక్తులు దర్శించుకోగా 24,503 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.06 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

రేపు కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

సిద్దిపేట కొమురవెల్లిలోని ప్రఖ్యాత మల్లికార్జున స్వామి కళ్యాణ వేడుక రేపు ఉ.10.45 గంటలకు వైభవంగా జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయ శాఖ పూర్తి చేసింది. ఈ కళ్యాణంతో బ్రహ్మోత్సవాలకు కూడా అంకురార్పణ జరగనుంది. రేపటి నుంచి మార్చి 24 వరకు నిర్వహించే జాతరకు ఏపీ, టీజీలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు వస్తారు.



మన్మోహన్ స్మారకార్థం స్థలం కేటాయించిన కేంద్రం

మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై వివాదం రాజుకున్న వేళ కేంద్రం కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అభ్యర్థన మేరకు మన్మోహన్ స్మారకార్థం ఢిల్లీలో స్థలం కేటాయింపునకు కేంద్ర హోంశాఖ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులకు తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. క్యాబినెట్ మీటింగ్ పూర్తయిన వెంటనే అమిత్ షా దీనిపై నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నాయి.



సజ్జల భార్గవ్‌కు ఊరట

సజ్జల భార్గవ్ రెడ్డికి హైకోర్టులో స్వల్ప ఊరట దక్కింది. 13 కేసులకు సంబంధించి ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారించిన న్యాయస్థానం, తదుపరి విచారణను జనవరి 3వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

నేడు కడపకు పవన్.. ఎంపీడీవోకు పరామర్శ

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అన్నమయ్య గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును పరామర్శిస్తారు. అనంతరం గాలివీడులోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శిస్తారు. దాడి జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకుంటారు. కాగా నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే.

నేటి నుంచి 4 రోజులు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు బంద్

ఏపీజీవీబీ బ్రాంచ్‌లు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్న నేపథ్యంలో నేటి నుంచి ఈ నెల 31 వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోనున్నట్లు ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. జనవరి 1 నుంచి సేవలు పునరుద్ధరిస్తామని చెప్పారు. బ్రాంచ్‌ల విలీనం జరిగినా ఖాతా నంబర్లు మారవని స్పష్టం చేశారు. కస్టమర్ల అత్యవసరాల నిమిత్తం ఈ నెల 30, 31 తేదీల్లో రూ.10వేల వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై సీపీఎం పోరుబాట

కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంపై రాష్ట్రవ్యాప్తంగా నిన్న వైసీపీ ఆందోళనలు చేపట్టగా సీపీఎం కూడా పోరు బాటపట్టేందుకు సిద్ధమవుతోంది. వచ్చే నెల 7, 10 తేదీల్లో విజయవాడ, కర్నూలులో ధర్నాలు, భోగి మంటల్లో ఛార్జీల పెంపు జీవోలను దహనం చేస్తామని ప్రకటించింది. మరోవైపు ఫిబ్రవరి 1-4 తేదీల్లో నెల్లూరు జిల్లాలో సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తామని నేతలు తెలిపారు.

వాచ్‌మెన్‌కు జాక్‌పాట్.. లాటరీలో రూ.2.32కోట్లు

దుబాయ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న హైదరాబాద్‌కు చెందిన రాజమల్లయ్య(60)కు జాక్‌పాట్ తగిలింది. ఇటీవల ప్రకటించిన బిగ్ టికెట్ మిలియనీర్ ఎలక్ట్రానిక్ లక్కీ డ్రాలో ఆయన మిలియన్ దిర్హామ్స్(రూ.2.32 కోట్లు) గెలుచుకున్నారు. దీంతో మల్లయ్య సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. తాను 30ఏళ్లుగా లాటరీ టికెట్ కొంటున్నానని, ఇప్పుడు అదృష్టం వరించిందని తెలిపారు. ఈ మొత్తాన్ని కుటుంబం, స్నేహితులతో పంచుకుంటానని తెలిపారు.

తెలంగాణ టెట్ అభ్యర్థులకు కీలక సూచనలు

జనవరి 2 నుంచి 20 వరకు టెట్ పరీక్ష జరగనుంది. ఉ.9 నుంచి 11.30 వరకు, మ.2 నుంచి 4.30 వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. అభ్యర్థులను గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలో అనుమతిస్తారు. ఎగ్జామ్ ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను క్లోజ్ చేస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

2025 ప్రభుత్వ సెలవుల వివరాలు

మరో 3 రోజుల్లో 2024 సంవత్సరం ముగిసిపోతుంది. 2025లోకి గ్రాండ్‌గా అడుగుపెట్టేందుకు అందరూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తాజాగా 2025లో పండగల సెలవులపై కూడా క్లారిటీ వచ్చింది. 2025 సంవత్సరానికి సంబంధించిన సాధారణ, ఆప్షనల్ సెలవుల లిస్ట్‌ను తెలంగాణ సర్కార్ తాజాగా రిలీజ్ చేసింది. వచ్చే ఏడాది మొత్తం 50 సెలవులు కాగా.. అందులో సాధారణ సెలవులు 27 , ఆప్షనల్ హాలిడేస్ 23 ఇస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. న్యూ ఇయర్



నేపథ్యంలో జనవరి 1న గవర్నమెంట్ సెలవు ప్రకటించింది. ఇందుకు బదులుగా ఫిబ్రవరి 08న రెండో శనివారాన్ని వర్కింగ్ డే అని పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది. . చంద్రుని ఆధారంగా ఈద్, మొహర్రం వంటి పండుగల తేదీలు మారవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి మార్పులు జరిగినా మీడియా ద్వారా ప్రకటిస్తారు.

సెలవులు	తేదీ	రోజు			
			గుడ్ ఫ్రైడే	18-04-2025	శుక్రవారం
న్యూ ఇయర్	01-01-2025	బుధవారం	(బక్రీద్)	07-06-2025	శనివారం
భోగి	13-01-2025	సోమవారం	మోహరం	06-07-2025	ఆదివారం
సంక్రాంతి	14-01-2025	మంగళవారం	బోనాలు	21-07-2025	సోమవారం
రిపబ్లిక్ డే	26-01-2025	ఆదివారం	స్వాతంత్ర్యదినోత్సవం	15-08-2025	శుక్రవారం
మహా శివరాత్రి	26-02-2025	బుధవారం	శ్రీకృష్ణ జన్మాష్టమీ	16-08-2025	శనివారం
హోళి	14-03-2025	శుక్రవారం	వినాయక చవితి	27-08-2025	బుధవారం
ఉగాది	30-03-2025	ఆదివారం	ఈద్ మిలాద్ ఉన్ నబీ	05-09-2025	శుక్రవారం
(రంజాన్)	31-03-2025	సోమవారం	బతుకమ్మ	21-09-2025	ఆదివారం
రంజాన్	01-04-2025	మంగళవారం	దసర	02-10-2025	గురువారం
బాబూ జగ్జీవన్			విజయ దశమి	03-10-2025	శుక్రవారం
రామ్ జయంతి	05-04-2025	శనివారం	దీపావళి	20-10-2025	సోమవారం
శ్రీరామ నవమి	06-04-2025	ఆదివారం	కార్తిక పౌర్ణమి	05-11-2025	బుధవారం
అంబేడ్కర్ జయంతి	14-04-2025	సోమవారం	క్రిస్మస్	25-12-2025	గురువారం
			క్రిస్మస్(బాక్సింగ్ డే)	26-12-2025	శుక్రవారం

20 నోటుపై రాసింది చూసి అందరూ షాక్

అభిషేకాలు, అర్చనలూ, నైవేద్యాలు, కానుకలూ.. భక్తిని ప్రకటించడంలో ఇవన్నీ మార్గాలు. భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికున్న దగ్గరిదారులు. ఇష్టదైవానికి తృణమో పణమో సమర్పించుకుంటే ఇంకెంత పుణ్యం.. ఇంకెంత పురుషార్థం..? అందుకే... మన భక్తి సబ్జెక్ట్‌లో దేవుడి హుండీకి అంత గొప్ప ప్రయారిటీలుంటాయ్. ఎవరి స్తోమతకు తగ్గట్టు వాళ్లు...హుండీలో కానుకలు వేస్తుంటారు. కొందరైతే నిలువు దోపిడి ఇస్తుంటారు. విన్నపాలు వినవలె అంటూ ఇష్ట దైవానికి అర్జీలు పెట్టుకుంటారు. అయితే కొన్నిసార్లు ఈ హుండీలో కానుకల్లో విదేశీ కరెన్సీ, బంగారు బిస్కెట్స్ కూడా కనిపిస్తూ ఉంటాయి. తమ పేర్లు బయటకు రాకుండా అజ్ఞాత భక్తులు ఇలా చేస్తుంటారు. మరికొన్నిసార్లు.. కరెన్సీ నోట్లపై లేదా చీటిల్లో తమ కోరికలు రాసి హుండీల్లో వేస్తుంటారు. కానుకల లెక్కింపు సందర్భంగా వాటిని చదివి ఆలయ సిబ్బంది నోరెళ్లబెడుతూ ఉంటారు. తాజాగా అలాంటి ఘటనే కర్నాటకలో వెలుగుచూసింది. తాజాగా కలబురగి జిల్లా అఫ్జలపుర తాలూకా ఘత్తరగి గ్రామంలోని భాగ్యవంతి దేవి టెంపుల్ హుండీ లెక్కింపు చేపట్టారు ఆలయ నిర్వాహకులు. నగదు లెక్కపెడుతండగా.. రూ.20 నోటుపై రాసింది చూసి అందరూ కంగుతిన్నారు. 'మా అత్త త్వరగా చనిపోవాలి' అని రూ.20 నోటుపై రాసి ఉంది. అత్త చావును అంతలా ఆకాంక్షిస్తున్నది అల్లుడా, కోడలా అనే చర్చ మొదలైంది. సంవత్సరానికి ఒకసారి గ్రామంలోని ఈ ఆలయ హుండీల్లో నగదు లెక్కిస్తారు. ఈ ఏడాది రూ.60 లక్షల డబ్బు, ఒక కిలో వెండి వస్తువులు కానుకల రూపంలో వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

రూ.6,000 కోట్ల పోంజీ స్కామ్.. నిందితుడు అరెస్ట్

రూ.6వేల కోట్ల పోంజీ స్కామ్ ప్రధాన నిందితుడు భూపేంద్రసింగ్‌ను సీఐడీ అరెస్టు చేసింది. గుజరాత్ మెహసానా జిల్లాలోని ఓ గ్రామంలో దాక్కున్న అతడిని ఎట్టకేలకు అదుపులోకి తీసుకుంది. బీజడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో అయిన ఇతను బ్యాంకుల కన్నా అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి వేలాది మందిని మోసం చేశారు. కొన్ని నెలలుగా అతను సీఐడీకి దొరక్కుండా తిరుగుతున్నారు.

ఏపీలో కొత్త మద్యం విధానం.. తెలంగాణ రాబడిపై ఎఫెక్ట్!

ఏపీలో కొత్తమద్యం విధానం తెలంగాణ రాబడిపై ప్రభావం చూపుతోంది. లిక్కర్ ధరలు తగ్గడంతో ఆ రాష్ట్రంతో సరిహద్దు ఉన్న జిల్లాల్లో మద్యం అమ్మకాలు తగ్గాయి. గతంతో పోలిస్తే ఒక్క డిసెంబర్‌లోనే రూ.40 కోట్ల రాబడి తగ్గినట్లు తెలుస్తోంది. నాగర్ కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, నల్గొండ, గద్వాల్ సరిహద్దుల్లో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల ఆదాయం తగ్గే అవకాశం ఉన్నట్లు గణాంకాలు పేర్కొన్నాయి.

హాట్ లుక్‌లో ఖుషీ కపూర్?

టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా ఓ సినిమా రాబోతుందని.. అలాగే, ప్రశాంత్ వర్మ సూపర్ హీరో సినిమాటిక్ యూనివర్స్ లోనే ఈ ప్రాజెక్ట్ కూడా ఉండబోతుందని టాక్. ఇప్పుడు ఈ క్రేజీ సినిమా గురించి అదిరిపోయే గాసిప్ వినిపిస్తోంది. ఈ సినిమాలో నందమూరి మోక్షజ్ఞ సరసన అతిలోక సుందరి 'దివంగత శ్రీదేవి' తనయ నటించబోతుందని ఆ రూమర్ సారాంశం. శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్ ని ఈ చిత్రంలో తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట. మోక్షజ్ఞ జోడీగా ఖుషీ కపూర్ అయితే అటు బాలీవుడ్ లో కూడా ఈ సినిమాకి క్రేజ్ ఉంటుంది. మరి ఈ కాంబినేషన్ సెట్ అయితే నందమూరి ఫ్యాన్స్ కి సర్ ప్రైజే. మరోవైపు ఖుషీ కపూర్ అక్క 'జాన్వీ కపూర్' `దేవర`తో టాలీవుడ్ లో లాంచ్ అవుతుంది. ఇప్పుడు చెల్లి వంతు వచ్చింది. విశేషం ఏమిటంటే.. శ్రీదేవి ఇద్దరు కూతుళ్లు నందమూరి వారసులతోనే టాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడం. అన్నట్టు ఖుషీ కపూర్ ఎంట్రీ పై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.

పెయిన్‌లెస్ ఇంజెక్షన్లు త్వరలో..

వైద్యుడి దగ్గరకు వెళ్తే సూది ఇస్తాడేమో అనే భయం ఇక అక్కర్లేదు. సూది లేకుండా, నొప్పి తెలియకుండా ఇచ్చే పెయిన్‌లెస్ ఇంజెక్షన్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఐఐటీ బాంబేకు చెందిన పరిశోధకులు ఈ షాక్ సిరంజీలను అభివృద్ధి చేశారు. చర్మాన్ని పదునైన సూదితో పొడవాల్సిన అవసరం లేకుండా షాక్‌వేవ్ ఆధారంగా ఈ సిరంజీ పని చేస్తుంది. షాక్ వేవ్‌ల ద్వారా ఒత్తిడిని కల్పించి, వెంట్రుక కన్నా సన్నగా ఉండే మొన(నాజిల్) ద్వారా వేగంగా శరీరంలోకి ఔషధాన్ని పంపించడం ఈ సిరంజీ ప్రత్యేకత. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ప్రయాణించే వేగం కంటే రెట్టింపు వేగంతో, సులభంగా ఇది ఔషధాన్ని శరీరంలోకి చేరు స్తుంది. దీని వల్ల నొప్పి కలగదు. వాపు లాంటి సమస్యలు ఉండవు. అనస్థీషియా, యాంటీఫం గల్, ఇన్సులిన్ అందించేందుకు ఎలుకలపై ఈ సిరంజీని పరీక్షించగా సమర్థంగా పని చేసింది.